క్లుప్తంగా

గవర్నర్‌కు సాదర వీడ్కోలు



విమానాశ్రయంలో గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రేణిగుంట: రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు గురువారం రాత్రి రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. తిరుపతి–తిరుమల పర్యటన అనంతరం ఆయన రాత్రి 7.50గంటలకు విమానాశ్రయానికి చేరుకుని గన్నవరం బయల్దేరి వెళ్లారు. ఆయనకు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఏఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, ఆర్డీఓలు రామారావు, కిరణ్‌కుమార్, తహసీల్దార్ శివప్రసాద్ వీడ్కోలు పలికారు.

పౌష్టికాహారంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న లలిత

ఏర్పేడు: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాలని సర్పంచ్ లలిత అన్నారు. పౌష్టికాహారంపై గురువారం పాపానాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, గర్భవతులు పౌష్టికాహారంతో పాటు తాజా కూరగాయలు, ఆకుకూరలు, పప్పుదినుసులు, కోడిగుడ్లు, మాంసకృత్తులతో కూడిన భోజనాన్ని తీసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. గ్రామ సంరక్షణ కార్యదర్శి భవాని, అంగన్‌వాడీ కార్యకర్త అమర, ఏఎన్‌ఎంలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

ఓటీఎస్ పట్టాల పంపిణీ



ఇందిరానగర్‌లో ఓటీఎస్ పట్టాలు అందుకుంటున్న లబ్ధిదారులు

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ గ్రామ పంచాయతీలో గురువారం స్థానిక సర్పంచ్ సల్లా వీరభద్రయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా ఓటీఎస్ పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొప్పన తిలక్‌బాబు, కో–ఆప్షన్ సభ్యులు సిద్ధిక్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణ స్థలం సర్వే



ఏఎల్‌సీఎం క్రీడా ప్రాంగణంలో సర్వే చేస్తున్న అధికారులు

నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీలో ఏఎల్‌సీఎం క్రీడా ప్రాంగణంలో సర్వేయర్ శ్రీరాములు సర్వే నిర్వహించారు. 309 సర్వే నంబర్‌లో 7.35 ఎకరాల భూమిలో ఆక్రమణలకు గురవుతున్న విషయమై చర్చి సంఘ పెద్దలు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ రాజేంద్ర ఆదేశాల మేరకు సర్వేయర్ తన సిబ్బందితో కలిసి క్రీడా ప్రాంగణంలో డ్రోన్ యంత్ర పరికరాలతో సర్వే నిర్వహించారు. సర్వేయర్ వెంట కోఆప్షన్ సభ్యులు భావన్ అనుదీప్, మాజీ కౌన్సిలర్ వరకళాచంద్, ట్రైనస్, శ్రీకర్, సంజయ్ తదితరులు ఉన్నారు.

ఈరోజు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

సత్యవేడు: స్థానిక బేరిశెట్టి కళ్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సమన్వయకర్త, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షులు రామ్ కుమార్ రెడ్డి, సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు దయాసాగర్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఏడు మండలాల పార్టీ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సింగిల్ విండో అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ నామినేటెడ్ పదవుల ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

మండల సమావేశం

వరదయ్యపాళెం: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు. శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం హాజరవుతారని, అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని కోరారు.

మురిపించేన్

- సామాజిక పింఛన్ పెంపుతో సర్వత్రా హర్షం
- మండలంలో మొత్తం 6,672 మంది పింఛనుదారులు



లబ్ధిదారులకు పింఛను ఇస్తున్న వలంటీర్ అనిత

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : అవ్వాతాతలకు ఇచ్చిన మాటను నెరవేర్చి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారి ఆశీస్సులు అందుకుంటున్నారు. తాను అధికారంలోకి వచ్చిన తరువాత సామాజిక పింఛను మొత్తాన్ని రూ.2వేల నుంచి దశలవారీగా రూ.3వేలకు పెంచుతామని పాదయాత్రలో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతూ వస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే రెండుసార్లు రూ.250 చొప్పున పెంచారు. జనవరిలో మూడవసారి రూ.250 పెంచి మొత్తంగా రూ.2750 చొప్పున ఇచ్చారు. దీంతో అవ్వాతాతల ఆనందానికి హద్దులు లేవు. మనుమడు జగను చల్లగా ఉండాలంటూ నిండుమనసుతో ఆశీర్వదిస్తున్నారు.

• జగన్ సర్కార్ భరోసా

మండలంలో మొత్తం 6672 మంది లబ్ధిదారులు పింఛను పొందుతున్నారు. వారిలో 3753 మంది వృద్ధాప్య పింఛనుదారులున్నారు. ఈ నెల నుంచి వారికి పింఛను పెంచి రూ.2750 ఇచ్చారు. గతంలో మండలానికి పెన్షన్ రూపేణా రూ.1.69 కోట్లు ఇస్తుండగా, జనవరి నుంచి రూ.1.82 కోట్లు ఇచ్చారు. మొత్తానికి రూ.13.49 లక్షలను మండలంలో అదనంగా ప్రభుత్వం చెల్లించింది.

• ఆనందమానందమాయె

సామాజిక పింఛను ఏడాదికి రూ.250 వంతున పెంచడంపై అవ్వాతాతలు, వితంతు, ఒంటరి మహిళలు, కళాకారులు, గీత కార్మికులు, దివ్యాంగులు పింఛను సొమ్ముతో తమకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధుల కష్టాలు తీర్చేలా..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మాకు పింఛను రూ.3వేలు చేస్తారనే నమ్మకం నాకుంది.ఆయన మా లాంటోళ్ల కష్టాలు తెలుసుకుని పింఛను పెంచుతూ వెళుతున్నారు. జనవరిలో రూ.2750 ఫింఛన్ ఇవ్వడం సంతోషంగా ఉంది.

– వెల్లంపాటి పొట్టయ్య, కాసారం దళితవాడ

చాలా సంతోషం



నా మనవడు జగన్ ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచడం ఆనందంగా ఉంది. ఇప్పటికే రెండు సార్లు రూ.250 పెంచి రూ.2500 ఇస్తున్నారు. మళ్లీ ఇప్పుడు రూ.250 పెంచి కొత్త సంవత్సరం జనవరిలో రూ.2750 చేయడం చాలా సంతోషం.

– ఆర్.పండుమ్మ, కాసారం

ఎలాంటి ఇబ్బందుల్లేవ్



ప్రతి నెలా పెన్షన్ సొమ్మును లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయిస్తున్నాం. కలెక్టర్ సూచనలు, సలహాల మేరకు లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశాం.

– తరుణాక్షిరెడ్డి, ఎంపీడీఓ, తొట్టంబేడు

గైనిక్, రేడియోగ్రాఫర్‌ను నియమించరూ!

–వైద్య శాఖ మంత్రికి ఎమ్మెల్యే ఆదిమూలం వినతి



డాక్టర్లను నియమించాలని మంత్రి విడదల రజనీని కోరుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: నియోజక వర్గ కేంద్రంలోని కమ్యూనిటీ వైద్యశాలలో ఖాళీగా ఉన్న గైనకాలజిస్టు, రేడియోగ్రాఫర్ పోస్టులను భర్తీ చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రాష్ట్ర వైద్యశాఖ మంత్రి విడదల రజనిని కోరారు. తిరుపతికి వచ్చిన మంత్రిని గురువారం ఆయన కలిశారు. సత్యవేడు పరిసర గ్రామాల్లో గర్భవతులు ప్రసవ సమయాల్లో దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని సమస్యలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వైద్యశాలకు మహిళా డాక్టర్‌ను నియమిస్తే అనుకూలంగా ఉంటుందని, అలాగే డాక్టర్ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

మృతుల కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : మండలంలోని చిన్నసింగమాలకు చెందిన చేనేత కార్మికుడు జీ.మల్లీశ్వరయ్య, చియ్యవరానికి చెందిన ఈ.వెంకటయ్య, పి. కాంతారావు గురువారం అనారోగ్యంతో మరణించారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు రూ.10 చొప్పున ఆ కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భక్తవత్సలం, ఓంకార్, నరసింహులు, మోహన్, ప్రేమకుమార్, రఘురాం, సుబ్రహ్మణ్యం, వేమాలయ్య, అలంకారయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. శైలజమ్మా!

- బాల్య వివాహాల నిర్మూలన బాధితురాలు చేస్తున్న ప్రచారానికి ప్రశంస
- ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని అభినందన



శైలజను సన్మానిస్తున్న శ్రీనివాసరావు

ఏర్పేడు: బాల్యవివాహాలతో ఆడపిల్లల జీవితాలు నాశనమతున్నట్లు ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని అంజిమేడు పంచాయతీ కృష్ణగిరి కాలనీలో బాల్యవివాహం చేసుకుని కష్టాలు పాలైన శైలజను శాలువలు, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, కృష్ణగిరికాలనీకి చెందిన శైలజకు 14 ఏళ్ల ప్రాయంలో వివాహమై ఆడపిల్లకు జన్మనిచ్చిందన్నారు. ఏడాది క్రితం భర్త వేధింపుల తట్టుకోలేక బిడ్డతో పాటు పుట్టింటికి చేరిందన్నారు. అప్పటి నుంచి కష్టాలు అనుభవిస్తున్న ఆమె ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో తన స్వీయ అనుభవాలు, బాల్యవివాహం మూలాన తాను పడిన కష్టాలు, పసిబిడ్డతో పుట్టింటికి చేరాక జీవనం కోసం చేస్తున్న బతుకు పోరాటాన్ని, తనలా బాల్య వివాహంతో ఎవరూ ఇబ్బందులను పడరాదని ఏర్పేడు, శ్రీకాళహస్తి, రేణిగుంట మండలాల్లో బాల్యవివాహాల నిర్మూలనకు తనవంతు కృషి చేస్తున్నట్లు ఆమె చెప్పడం సదస్సులో తనకు కదలించిందన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా పర్యటనకు వచ్చిన తాను ఆమెను ప్రత్యేకంగా అభినందిచడానికి ఇక్కడికి వచ్చినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ డైరెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రి ఆర్‌కే రోజా, మంత్రి విడదల రజని, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రేణిగుంట: రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు గురువారం రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. రేణిగుంట వద్దనున్న బాలాజీ మెడికల్ కాలేజీ, తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన లైబ్రరీ శంఖుస్థాపన కార్యక్రమాలలో పాల్గొని తిరుమల దర్శనానికి వెళ్లేందుకు గురువారం ఆయన రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన వెంట గవర్నర్ స్పెషల్ సీఎస్ సిసోడియా వచ్చారు. బాలాజీ మెడికల్ కళాశాల వద్ద ఆయనకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు ఆర్కే రోజా, విడదల రజిని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పుష్పగుచ్ఛాలను అందించి సాదర స్వాగతం పలికారు. అంతకుముందు విమానాశ్రయంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఈఎంసీ సీఈఓ గౌతమి, ఏఎస్పీ కులశేఖర్, ఆర్డీఓలు రామారావు, కిరణ్ కుమార్, ఎయిర్‌పోర్ట్ సీఎస్ఓ రాజశేఖర్‌రెడ్డి, రేణిగుంట తహసీల్దార్ శివప్రసాద్ స్వాగతం పలికారు.

సురక్షిత నీటితోనే ఆరోగ్యం



విద్యార్థులకు నీటినమూనా పరీక్షలు చేసి చూపుతున్న అధికారులు

శ్రీకాళహస్తి రూరల్: సురక్షిత నీటితోనే ఆరోగ్యంగా ఉంటామని ప్రగతి సంస్థ టీమ్ లీడర్ ప్రభాకర్ అన్నారు. గురువారం శ్రీకాళహస్తి మండలం ముచ్చువోలు జెడ్పీ హైస్కూలులో ప్రగతి సంస్థ నీటి పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించింది. ఆయన మాట్లాడుతూ, శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, రేణిగుంట మండలాల్లో తమ సంస్థ జల్‌జీవన్ మిషన్ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. నాలుగు మండలాల్లో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా సురక్షితమైన నీటిని ఇవ్వడానికి జలజీవన్ మిషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వ సహకారంతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని నీటి సరఫరాలో సమస్యలు ఉంటే వాటిని గుర్తించి, స్థానిక సర్పంచ్ దృష్టికి తీసుకెళితే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కుమారి, రామచంద్రయ్య, ధనశేఖర్ పాల్గొన్నారు.

లార్వాల నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని సాంబయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు ఆధ్వర్యంలో దోమల లార్వాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పాత్రల్లో నీళ్లను నిల్వ ఉంచరాదని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్త పద్మమ్మ, ఆశా కార్యకర్త రుక్మిణి పాల్గొన్నారు.

పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం



విద్యార్థులకు మార్గదర్శిని పుస్తకాలను ఇస్తున్న వే ఫౌండేషన్ సభ్యులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : విద్యార్థులు పట్టుదలతో ప్రయత్నిస్తే దేనిలోనైనా విజయం సాధించగలరని మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ చంద్రప్ప అన్నారు. గురువారం తొట్టంబేడు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైడి అంకయ్య, మాజీ ప్రిన్సిపాల్ శ్రీరాములు ఆధ్వర్యంలో విజయ సోపానయాత్ర కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంత విద్యార్థినీవిద్యార్థులకు ఉన్నత చదువులపై అవగాహన కల్పించారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుంటే సరిపోదని, దానిని అందుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకుపోవాలన్నారు. అప్పుడే విజయవిఖరాలను అందుకుంటారన్నారు. అనంతరం విద్యార్థులకు మార్గదర్శిని పుస్తకాలను అందజేశారు.కార్యక్రమంలో బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెంచిన పించన్లు పంపిణీ



దాసుకుప్పంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రవి రెడ్డి

సత్యవేడు: సామాజిక పింఛన్ రూ. 2750కు పెంచడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తం అవుతోందని సర్పంచ్ రవిరెడ్డి అన్నారు. గురువారం దాసుకుప్పం పంచాయతీలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏఏఎం బాలాజీ రెడ్డితో కలసి సర్పంచ్ పింఛన్లు పంపిణీ చేశారు. నూతనంగా 19 మందికి పింఛన్లు మంజూరు కాగా పంచాయతీ పరిధిలో 570 పింఛన్లు అందజేశారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వపాలన సాగిస్తోందని రాష్ట్ర కార్యదర్శి అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కే.రమణమూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

సాధువులకు దుప్పట్లు..

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వయంభు లింగస్వామి ఆశ్రమంలో గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సాధువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత ఆయన ఆశ్రమంలోని సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్నారు. అనంతరం లింగస్వామిని సన్మానించి ఆయన మాట్లాడారు. మానవుడిలో మాధవుని చూస్తూ నిరాశ్రయులు, పేదలకు స్వయంభు లింగ స్వామి సేవలు చేయడం అభినందనీయమన్నారు. మనం చేసే సేవలే పరమేశ్వరుని మోక్షానుగ్రహం లభించడానికి మార్గమన్నారు. కార్యక్రమంలో సాధువులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ



సత్యవేడులో..

సత్యవేడు: మండల ఎస్టీయూ శాఖ క్యాలెండర్లు, డైరీలను గురువారం సాయంత్రం ఎంఆర్‌సీ కార్యాలయ ఆవరణలో ఎంఈఓ కే.రవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీలు సురేష్, ఎస్.వెంకటేశ్వర్లు, కోటీశ్వరం, అసోసియేషన్ సభ్యులు మురుగేశన్, చెంచుకృష్ణ, వేలాయుధం, ఉపేంద్ర, తౌడు, జయమణి, గౌరీశంకర్, కిరణ్‌కుమార్, ప్రభావతి, మహేశ్వరి, దాము తదితరులు పాల్గొన్నారు.



బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఎస్టీయూ డైరీలు, క్యాలెండర్లను ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రయ్య, కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో ఎంఈఓ రవీంద్రనాథ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పట్టాభిరెడ్డి, దేవేంద్ర, శారద, కోమల, జయప్రకాష్, కులశేఖర్, బత్తయ్య, తిరుమలరావు, చంద్రశేఖర్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నేత మృతి



ఎస్‌వీఎస్ బాబు భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు, ఎస్‌వీఎస్ బాబు(ఫైల్)

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వీఎస్.బాబు(52) గురువారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై కుప్పకూలారు. హుటాహుటిన ఆయన్ను ఇంటి సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు నిర్ధారించడంతో మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన ముద్దుమూడికి తరలించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న వెంటనే జిల్లా ఆర్టీసీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి చెంగల్‌రెడ్డి, శ్రీకాళహస్తి డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి, కార్మికులు బాబు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మంచి కార్మిక నాయకుడిని కోల్పోయాం

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మంచి పోరాటపటిమ కలిగిన కార్మిక నాయకుడిని కోల్పోయామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ముద్దుమూడికి వెళ్లి బాబు మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడైన శ్రీకాళహస్తి ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కూడా నివాళులర్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని రౌతు సూరమాల, పొయ్యి సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో గురువారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షులు మదన మోహన రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మదన్‌మోహన్, లింగమ నాయుడుపల్లె, పొయ్యి సర్పంచులు వెంకటేశ్వర్లు నాయుడు, మణి, సచివాలయ కన్వీనర్లు నరసింహ, మోహన్, మండల ఎమ్మెల్సీ ఇన్‌చార్జి కేతినేని వెంగళరావు, అశోక్, పార్టీ కార్యకర్తలుపాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

ఏర్పేడు: మండలంలోని వికృతమాల దళితవాడలో ఆదర్శ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ విగ్రహాన్ని స్థాపించి జనవరి 5 నాటికి 4 ఏళ్లు పూర్తికావడంతో పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆదర్శ్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఐతేపల్లి గురునాథం పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి



అడ్మిన్ సెక్రటరీలతో మాట్లాడుతున్న కమిషనర్ (ఎఫ్ఏసి) వెంకటరమణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలో వందశాతం పన్నులు వసూలు చేయాలని కమిషనర్(ఎఫ్ఏసీ) వెంకటరమణ ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అడ్మిన్ సెక్రటరీలకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, ఖాళీ జాగా పన్నులు మొదలైన వాటి చెల్లింపుల శాతం చాలా తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలను చైతన్యవంతులను చేసి సకాలంలో చెల్లించే విధంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చర్యలు తీసుకోవాలన్నారు. పన్నుల బకాయి అధికంగా ఉన్నవారికి కుళాయి కనెక్షన్లు తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ నారాయణరెడ్డి, మేనేజర్ ఉమామహేశ్వరరావు, టీపీఓ మధుసూదన్, ఆర్ఐలు రవికాంత్, బాలచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను దేవదాయశాఖ అధికారులు గురువారం లెక్కించారు. అధికారులు, బ్యాంకు అధికారుల సమక్షంలో కానుకలను లెక్కించగా రూ.8,43,271 వచ్చినట్లు తెలిపారు.